# 1/70 చట్టం అమలుకు అభ్యర్థులపై ఒత్తిడికి నిర్ణయం

14-10-1989

రంపచోడవరం, అక్టోబరు 13 (న్యూస్‌టుడే): గిరిజన ప్రాంతంలో భూబదలాయింపులు నిషేధించే (1/70) 1 ఆఫ్ 70 చట్టం తప్పకుండా అమలు చేస్తామని, ఆ చట్టం రద్దు చేసే ప్రసక్తి లేదని ప్రభుత్వం ప్రకటించేలా రానున్న ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులపై గిరిజనులు ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించినట్లు రాష్ట్ర గిరిజన సంఘం కన్వీనర్ శ్రీ తొక్కులూరి కన్నయ్య బుధవారం నాడిక్కడ విలేకరులకు తెలిపారు. ఈ నెల 7వ తేదీన విశాఖ జిల్లా ఏజెన్సీ ప్రాంతం అయిన 'గూడెం'లో రాష్ట్ర గిరిజన సంఘం సమావేశంలో ఈ నిర్ణయం గైకొన్నట్లు శ్రీ కన్నయ్య తెలియచేశారు. 70 చట్టం గట్టిగా అమలు చేయిస్తామని, సెటిల్మెంట్ పట్టాల మీద విచారణ చేసే అధికారాలను జిల్లా కలెక్టర్లకు ఇచ్చే ప్రతిపాదనపై ఉత్తర్వులు జారీ చేస్తామని, రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన జనాభా అధికంగా గల 450 గ్రామాలను షెడ్యూల్డు ప్రాంతాలలో చేర్పిస్తామని ప్రజా ప్రతినిధులు హామీ ఇచ్చేటట్లు గిరిజనులు వారిపై ఒత్తిడి తీసుకురావాలని సమావేశంలో నిర్ణయించినట్లు శ్రీ కన్నయ్య తెలిపారు.

రాజ్యాంగ సూత్రాల ప్రకారం స్థానిక పాలనలో గిరిజనులను భాగస్వామ్యం చేసేలా పొందు పరచి ఉందని కాని ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక పరిపాలనలో గిరిజనులకు తగిన రిజర్వేషన్లు కల్పించబడడం లేదని ఆయన ఆరోపించారు. మండల కర్షక పరిషత్, న్యాయ పరిషత్, సహకార సంఘాలలో గిరిజనులకు తగిన రిజర్వేషన్లు విధిగా పాటించాలని గిరిజన సహకార కార్పొరేషన్‌కు అనుబంధంగా ఉన్న సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు జరిపించాలని సమావేశంలో తీర్మానించినట్లు ఆయన తెలిపారు.

మండలాల పునర్విభజనలో-ఒకే ప్రాంతంలోని గిరిజన గ్రామాలను అనేకచోట్ల అనేక మండలాలలో సర్దారని ఇలా చేయడంవల్ల తక్కువ సంఖ్యలో గల గిరిజన గ్రామాల అభివృద్ధి పరిపాలన కుంటుపడిపోయిందని సమావేశం విమర్శించినట్లు ఆయన తెలిపారు. గతంలో ప్రత్తిపాడు తాలూకాలో 40 గిరిజన గ్రామాలును ప్రక్కనే విశాఖ జిల్లాలో కలిపి ఒక గిరిజన మండలంగా ఏర్పరచవలసి ఉండగా, అలా కాకుండా, ప్రత్తిపాడు తాలూకాలోని ఆ 40 గ్రామాలను తుని, కోటనందూరు, శంఖవరం మూడు మండలాల్లో సర్దారని, ఇలా చేయడంవల్ల అధికారులను కలుసుకురావడం కష్టమైపోతోందని సమావేశంలో అభిప్రాయపడినట్లు ఆయన తెలిపారు. గిరిజనుల అవగాహన కోసం ఈ పరిణామాలపై సమాచారాన్ని ప్రచురించి, ఈ విషయాలను అర్థం చేసుకోవడానికి తగిన శిక్షణ గిరిజనులకు ఇవ్వవలసిందిగా సమావేశంలో పాల్గొన్న రాష్ట్రంలోని గిరిజన స్వచ్ఛంద సంస్థలను కోరినట్లు ఆయన తెలిపారు. తదుపరి సమావేశం నవంబర్ 10వ తేదీన గిరిజన ప్రజల సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా 'చట్టి' గ్రామంలో జరుగుతుందని ఆయన ప్రకటించారు.

ఈ సమావేశంలో తూర్పుగోదావరి జిల్లా నుండి శక్తి (రంపచోడవరం), లయ (అడ్డతీగల), గిరిజన దీపిక (అడ్డతీగల), స్పందన (పెదమల్లాపురం) స్వచ్ఛంద సంస్థలు, ఖమ్మం జిల్లా నుండి యార్డ్ (చంద్రుగొండ), గిరిజన ప్రజల సంఘం (చట్టి), గిరిజన సీమ సంక్షేమ సంఘం (చింతూరు), విశాఖ జిల్లా నుండి 'చైతన్య స్రవంతి' (గూడెం), 'నవనిర్మాణ సమితి' శ్రీకాకుళం జిల్లా నుండి జనచేతన మరియు 'గిరిజన సేవా సమితి' మొదలైన స్వచ్ఛంద సంస్థల, ప్రతినిధులు, ఆయా సంస్థలలో పనిచేస్తున్న గ్రామాలలోని గిరిజన ప్రజా ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు